వదలని ప్లాస్టిక్ భూతం!

- జోరుగా ప్లాస్టిక్ అమ్మకాలు
- ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం
- కన్నెత్తి చూడని అధికారులు



ఎద్దుల మార్కెట్‌కు వెళ్లే దారిలో డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు



గతంలో దాడులు నిర్వహించి పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకున్న అధికారులు (ఫైల్)

ఎమ్మిగనూరు టౌన్: ప్లాస్టిక్ వాడకంతో సకల జీవ రాశులకు ముప్పు తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా, కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినా వాటి ఆమలులో మాత్రం స్థానిక అధికారులు విఫలమవుతున్నారు. పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వాడకం మొదట్లో కొద్దిరోజులు కట్టడి చేసిన అధికారులు నిద్రావస్థలోకి వెళ్లిపోవడంతో మళ్లీ ప్లాస్టిక్ అమ్మకాల జోరందుకున్నాయి. దీంతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు డ్రైనేజీ, వాగులు, వంకలు కలుషితమైపోతుండటంతో ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి.

అంతా ప్లాస్టిక్‌మయం

పర్యావరణ పరిరక్షణ చట్టం కింద 1996 సంవత్సరంలో ప్లాస్టిక్‌ను నిషేధించారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ బ్యాగుల తయారీ, అమ్మకాలు, వాడకంపై ప్రభుత్వం నిషేధించింది. అయిప్పటికీ వీటి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పైగా వినియోగం మరింత పెరిగిపోయింది. పాలిథిన్ బ్యాగులు, ప్లాస్టిక్ గ్లాసుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపార సముదాయాలు, కాయగూరల మార్కెట్, పండ్ల వ్యాపారులు, హోటళ్లలో ప్లాస్టిక్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారు. కొందరు వ్యాపారులు ప్లాస్టిక్ అమ్మకాలపై లాభాలు ఎక్కువ వున్నాయని విచ్చలవిడిగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాటి విక్రయాలు జరుగుతున్నా నిరోధించే నాథుడే కరువవడంతో ప్లాస్టిక్ లేనిదే వ్యాపారం లేదన్న విధంగా మారిపోయింది. ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తామన్న అధికారులు పత్రికా ప్రకటనలకే పరిమితమతున్నారేకానీ ఆచరణలో పెట్టలేకపోతున్నారు. ఎప్పుడో ఆర్నెళ్ల క్రితం ఓ సారి దాడులు నిర్వహించి పలువురికి జరిమానాలు విధించి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఏదుకాణానికి వెళ్లినా పాలిథిన్ సంచుల్లోనే విక్రయాలు కొనసాగుతున్నాయి.

ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన కాలువలు

పట్టణంలోని మురుగు కాలువలు ఎక్కువ శాతం నిషేధిత ప్లాస్టిక్ వ్యర్థాలతోనే నిండిపోయాయి. ఏడ్రైనేజీలో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. వాటిని తొలగించేందుకు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు అనారోగ్యాలపాలైన సందర్భాలూ లేకపోలేదని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. ప్లాస్టిక్ వాడకంపై వున్న నిషేధం, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసి చైతన్య పరచాలని, ప్లాస్టిక్ విక్రయించే వ్యాపారులపై జరిమానాలు విధించాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ ఉపయోగిస్తే కఠిన చర్యలు



పట్టణంలో వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్లాస్టిక్ వినియోగంపై శానిటరీ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బందితో దాడులు నిర్వహించి పలు మార్లు దుకాణదారులు, వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశాం. ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకై ప్లాస్టిక్ వినియోగించకుండా సహకరించాలి

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

చిన్న వయస్సులో వివాహం నేరం



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : అమ్మాయిలకు చిన్న వయస్సులలోనే పెళ్లిళ్లు చేయడం నేరమని హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మినరసమ్మ, సోషల్ వర్కర్ గీతావాహిని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సచివాలయం – 1లో శుక్రవారం కిశోర (11 నుంచి 19సంవత్సరాల వయస్సు) బాలికలకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా పల్లెల్లోనే అధిక సంఖ్యలో చిన్న చిన్న అమ్మాయిలకు పెళ్లిళ్లు చేస్తుంటారని, అందుకనే ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న వయసులో పెళ్లి చేసుకుంటే శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయన్నారు.కార్యక్రమలో మహిళా పోలీస్ శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు సుకన్య, చిట్టెమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల : కొత్త రేషన్ కార్డు కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేషన్ కార్డు లేని వారు, కొత్తగా పెళ్లి చేసుకున్న వారు కొత్త రేషన్ కార్డు మంజూరు కోసం సంబంధిత ధ్రువపత్రాలు తీసుకొని గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే రేషన్ కార్డులో పేర్లు తప్పుఒప్పులను సరిచేసుకోవడం గాని, పేర్లను చేర్చుకోవడం, ఇతర ప్రాంతాలకు బదిలీ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఈనెల 20వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ బీజేపీ నాయకత్వంలోని 11 సంవత్సరాల పాలనలో ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అఖండ, రైతు కూలీ సంఘం నాయకులు సొరప్ప, ఐఎఫ్‌టీయూ నాయకులు నారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రతో ఆర్‌డీటీ సెట్ రద్దు

ఆదోని సెంట్రల్: బీజేపీ కుట్రతో ఆర్డీటీ సెట్ రద్దయ్యిందని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విదేశీ సహాయ చట్టం రెన్యూవల్‌ను నిరోధించి సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు, పండ్లతోటల అభివృద్ధి, దళితులు,గిరిజనులు, బడుగు బలహీనవర్గాల విద్య, వైద్య సేవలందిస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఆర్డీటీ సంస్థ అందిస్తుందన్నారు. నిస్వార్థ సేవలకు బీజేపీ ప్రభుత్వ రాజకీయ అడ్డంకులు సృష్టించడం తగదన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



వాహనాల తనిఖీ చేపడుతున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. గురువారం రాత్రి పట్టణంలోని భీమాస్ సర్కిల్, ఎంఎం రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనదారులకు ఓవర్‌లోడ్, త్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎమ్మిగనూరు టౌన్ : మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్పీల సంఘం కన్వీనర్ బి.సునీత, సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులతో కలిసి మెప్మా ఉద్యోగులు మెప్మా అధికారి జయవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పొదుపు సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో కీలక పాత్ర వహిస్తున్న ఆర్పీలకు కేవలం రూ.8వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ధరలు పెరుగుదల వల్ల ఈ వేతనం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మే 20న దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్పీల సంఘం నాయకులు పద్మ, సావిత్రి, గంగా తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ఆదోని సెంట్రల్: అప్‌గ్రేడ్ అయిన పురపాలక ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయ పోస్టులను కేటాయించి భర్తీ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి.నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు కోరారు. శుక్రవారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పట్టణంలోని పురపాలక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల, కల్లుబావి పురపాలక ఉన్నత పాఠశాల, కిలిచినపేట, అండర్‌పేట, అస్మియా ఉర్దూ పురపాలక ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులను కేటాయించాలన్నారు. అలాగే అర్హులైన ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు లోక్యానాయక్, వీరచంద్రయాదవ్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, భీమరాజు, రాజా సతీష్, గంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు హేయమైన చర్య



తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న గోనెగండ్ల జర్నలిస్టులు

గోనెగండ్ల: నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడే పత్రికా సంస్థల ఎడిటర్ ఇళ్లపై ఎలాంటి సమాచారం లేకుండా, కనీసం నోటీసులు జారీ చేయకుండా సోదాలు చేయడం హేయమైన చర్య అని గోనెగండ్ల జర్నలిస్టులు అక్బర్ వలి, గౌస్ మొద్దీన్‌లు అన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు సోదాలు చేయడంపై శుక్రవారం గోనెగండ్ల జర్నలిస్టులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిరసన తెలియజేసి తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కరుణాకర్, ఈశ్వర్, కిరణ్, షఫీ, వీర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న సీడీపీవో సఫర్నీసాబేగం

ఎమ్మిగనూరురూరల్: బాలికల విద్యను ప్రోత్సహిస్తే వారికి మంచి భవిష్యత్ ఇచ్చిన వారమవుతామని సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. శుక్రవారం పట్టణలోని సంజీవయ్యనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో 11 నుంచి 18 సంవత్సరాలలోపు కిషోర బాలికల వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుకోకుండా పనులకు వెళ్తున్నారని, తల్లిదండ్రులు బాలికలను బాగా చదవించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేయాలని, బాల్య వివాహం చేస్తే అనారోగ్య సమస్యలకు గురికావలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపేట అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సాయికిరణ్, వార్డ్ హెల్త్ సెక్రటరీలు బంగారమ్మ,అంబికా, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

కోసిగి: కిశోర బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం పై అవగాహన కల్పించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్స్ భాగ్యలక్ష్మీ బాయి, క్యాతాయని సూచించారు. శుక్రవారం మండలంలోని సజ్జలగుడ్డం, జంపాపురం గ్రామాల్లో వేర్వేరుగా కిశోర వికాసంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు వనజాక్షి, రామలక్ష్మీ,సరోజ, లక్ష్మీ, భాగ్యలక్ష్మీ, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ రంగ రవళి

గోనెగండ్ల: ఎండలు అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ సోకకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రంగ రవళి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వేసవిలో ప్రజలు ఆరోగ్య సూత్రాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వేసవిలో 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని, ఎండలో తిరగడం వలన వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 60 సంవత్సరాలు పైబడిన వారికి, పసిపిల్లలకు ఎక్కువగా వడదెబ్బబారిన పడే అవకాశం ఉందన్నారు. పనిచేసే వారు ఉదయం 6 నుంచి 11 గంటల లోపు పూర్తి చేసుకోవాలన్నారు. ఆరోగ్య ఉప కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచమని తెలిపారు. ప్రజలు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఎవరికైనా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలన్నారు.

వడదెబ్బ తగిలిన సమయంలో ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి చేర్చడం, చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరం తుడవాలి, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలాగే చేస్తుండాలి. ప్రజలకు తమ పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి. ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు.

వడదెబ్బ లక్షణాలు

చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర, పాక్షికంగా అపస్మారక స్థితికి చేరడం తదితర లక్షణాలు ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో ఎక్కువగా బయట తిరగరాదు. గొడుగు వాడటం, తలపై టోపీ పెట్టుకోవడం, ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ముందుగా మంచినీరు తాగి వెళ్లడం మంచిది. శీతాల పానీయం బదులుగా నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తాగటం ఉత్తమం.

శిథిలావస్థలో ఎల్లెల్సీ క్రాస్ రెగ్యులేటర్



ఎల్లెల్సీ హొళగుంద సెక్షన్ 193 కి.మీ వద్ద నిరుపయోగంగా ఉన్న గేట్లు



సమ్మతగేరి వద్ద క్రాస్ రెగ్యులేటర్ గేట్లు దించడం వల్ల నిలిచిన నీరు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) హొళగుంద సెక్షన్ 193 కి.మీ వద్ద ఏడు మోరిగా పిలిచే కాలువకు ఉన్న గేట్లు (క్రాస్ రెగ్యులేటర్) శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారాయి. వాటికి మరమ్మతులు చేసి పని చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాలువ ముందు భాగంలో ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు వంకలకు, డిస్ట్రిబ్యూటరీ కాలువకు నీటిని మళ్లించేందుకు 193 కి.మీ వద్ద కాలువ నిర్మాణ సమయంలో ఏడు మోరీలు నిర్మించి వాటికి గేట్లు ఏర్పాటు చేశారు. గేట్లు ఎత్తేందుకు గాను మోటార్లు కూడా ఉండగా వాటిని నిర్వహించేందుకు జనరేటర్ ఏర్పాటు చేయలేదు. దీంతో గేట్లు వినియోగానికి నోచుకోకపోవడంతో తుప్పపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎల్లెల్సీలో నీటి సరఫరాను నిలిపివేసినప్పుడు ఈ గేట్లను దింపి అక్కడ నిలిచేనీటిని రైతులు పంటలకు వాడుకుని గట్టెక్కేవారు. ప్రస్తుతం జనరేటర్ లేకపోవడంతో నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేక రైతులతో పాటు పశువులకు తాగునీరులేకుండా పోయింది. సమ్మతగేరి వద్ద ఉన్న ఇలాంటి క్రాస్ రెగ్యులేటర్ పని చేస్తుండడంతో అక్కడి రైతులు గేట్లను దింపి కొద్ది రోజుల పాటు నీటిని వాడుకుంటున్నారు. టీబీ బోర్డు అధికారులు స్పందించి 193 కి.మీ వద్ద ఉన్న క్రాస్ రెగ్యులేటర్ పని చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేత జట్టు ఏఆర్‌టీంకు నగదు బహుమతిని అందజేస్తున్న దృశ్యం

ఆదోనిసెంట్రల్: మండలంలోని పెసలబండ గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి జాతర సందర్భంగా శుక్రవారం కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఏఆర్‌టీం జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు టీం కెప్టెన్ గణేష్‌కు రూ.10 వేలు అందజేశారు. టీం కోచ్ హరిబాబు, పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ రామన్న విజేతలను అభినందించారు.

సమస్యలు పరిష్కరించండి

మంత్రాలయం: ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోరారు. శుక్రవారం మంత్రాలయం మండల కేంద్రంలో కుప్పకూలిన ఓహెచ్ఆర్ ట్యాంకు పరిశీలన నిమిత్తం ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ హురేరామ్ నాయక్ విచ్చేశారు. ఆయనతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఫోన్లో సంప్రదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేసేలా చూడాలన్నారు. వెనుకబడిన నియోజకవర్గాలకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు సీఈ సమాధానమిస్తూ ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రజల తాగునీటి ఎద్దడి పనులు పూర్తయ్యేలా చూస్తామని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రత్యేక పూజలు

ఆస్పురి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామో హన్ శర్మ, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్ల ను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

కౌతాళం : మండల పరిధిలోని ఉపరహాళ్ గ్రామానికి చెందిన తలారి పెద్ద ముదుకప్ప (72) తపని నిమిత్తం శుక్రవారం ఆదోని వెళ్లాడు. సాయంత్రం ఆదోనిలోని కొత్త రైల్వే బ్రిడ్జ్ వద్ద (బీరప్ప నగర్ సమీపంలో) రైలు పట్టాలు దాటుతుండగా రైలు నెంబర్ 17321 ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. మృతుడికి భార్య నల్లమ్మ, కుమారుడు రంగన్న, కూతురు పార్వతి ఉన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్: ఆదోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 103 కేసుల్లో పట్టుబడిన 1903 లీటర్ల కర్ణాటక మద్యాన్ని శుక్రవారం కర్నూలు ఏఈఎస్ ఆధ్వర్యంలో వాహనం కింద పడేసి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ తెలిపారు. వాటి విలువ రూ.7.95 లక్షలు ఉంటుందన్నారు. కర్ణాటక మద్యం, నాటుసారాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

న్యాయవాద వృత్తిలో రాణించాలి



మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: జూనియర్ న్యాయవాదులు వృత్తి నైపుణ్యాలు పెంచుకొని న్యాయవాద వృత్తిలో రాణించాలని ఆదోని సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి పి.జె. సుధ అన్నారు. శుక్రవారం ఆదోని బార్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నలుగురికి న్యాయం చేసేవిధంగా, సాయపడేలా న్యాయవాదులు ముందుకెళ్లాలన్నారు. అనంతరం జూనియర్ న్యాయవాదులుగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారికి క్రిమినల్ లా బేర్ యాక్ట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మజహర్ ఉల్‌హక్, మన్సూర్ అహ్మద్, దేశాయ్, వై.ఆర్.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



కనకవీడులో దగ్ధమైన గడ్డివాములు

నందవరం : మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో శుక్రవారం రైతు నాగేంద్రప్పకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పులు రావడంతో పక్కనే ఉన్న గడ్డి వాములకు మంటలు వ్యాపించాయి. మంటలు అదుపు చేయడానికి గ్రామస్తులు ప్రయత్నించినా వీలుకాలేదు. సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు, సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే 70 శాతం పశుగ్రాసంతో పాటు పశువుల ఎరువు(దిబ్బ) కాలిపోయింది. దాదాపు రూ.1.90 లక్షలు నష్టం వాటిల్లిందని ఫైర్ ఆఫీసర్ తెలిపారు. పశువులు, ఎద్దుల కోసం ఏర్పాటు చేసుకున్న పశుగ్రాసం కాలిపోయిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

పాదయాత్రను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఈనెల 11, 12,13వ తేదీల్లో తాగునీటి సమస్యపై సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే పాదయాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి సమస్య నెలకొందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పదిహేను రోజులుగా గ్రామాలకు తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి సమస్యకు ప్రభుత్వం శాశ్వతమైన పరిష్కారం చూపాలన్నారు. పెద్దతుంబళంలో పాదయాత్ర ప్రారంభమవుతుందని, మే 11, 12, 13వ తేదీల్లో మూడు రోజులపాటు 22 గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి, మే 14న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామన్నారు. ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వీరారెడ్డి, రామాంజనేయులు, ఉచ్చీరప్ప తదితరులు పాల్గొన్నారు.

కౌతాళంలో పారిశుద్ధ్య పనులు



వైఎస్సార్ సర్కిల్ వద్ద పనులు చేస్తున్న దృశ్యం

కౌతాళం: ఖాదర్‌లింగస్వామి ఉరుసు సందర్భంగా మండల కేంద్రమైన కౌతాళంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఎక్కడా పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని, గ్రామంలోని అన్ని డ్రైనేజీ కాలువల్లో పేరుకు పోయిన చెత్తచెదారాన్ని తొలగిస్తున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి ప్రకాశం తెలిపారు. కొన్ని చోట్ల కాలువల్లో మట్టి పూడికతీత పనులను కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రజలు, వ్యాపారులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని పంచాయతీకి సహకారం అందించాలన్నారు.

'కూల్' డ్రింక్



చెట్టుపై కూల్ డ్రింక్ సేవిస్తున్న వానరం

రోజు రోజుకు వేసవి తాపం పెరుగుతుండటంతో మనుషులతో పాటు పశుపక్షాదులు విలవిలాడుతున్నాయి. మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామంలో ఓ వానరం వేసవి తాపం తట్టుకోలేక అటూ.. ఇటూ సంచరిస్తుంటే అక్కడ ఉన్న వారు చెట్టుపై ఉన్న వానరానికి మూతతీసి కూల్ డ్రింక్ బాటిల్ అందివ్వటంతో వెంటనే దాహం తీర్చుకుంది. వానరం కూల్ డ్రింక్‌తో దాహం తీర్చుకుంటున్న దృశ్యం అందరినీ అకట్టుకుంది.

– ఎమ్మిగనూరురూరల్